సాక్షి
యాదాద్రి భువనగిరి
గురువారం ¦ 14 ¦ ఆగస్టు ¦ 2025



**మోసం చేసిన సీఎం**
రాష్ట్రంలో 50లక్షల మంది పింఛన్‌దారులను సీఎం రేవంత్‌రెడ్డి మోసం చేశాడని మందకృష్ణ మాదిగ విమర్శించారు. - 8లో



**యూరియా కష్టాలు**
కాంగ్రెస్ పాలనలో మళ్లీ యూరియా కష్టాలు మొదలయ్యాయని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. - 8లో



**బడిని బతికించాడు**
భువనగిరి మండలం ఎర్రంబెల్లి ప్రాథమిక పాఠశాల మూతబడి 12 సంవత్సరాల తర్వాత తిరిగి తెరుచుకుంది. - 9లో

## న్యూస్‌రీల్

### కనులపండువగా నిత్యకల్యాణం

**యాదగిరిగుట్ట:** పంచనారసింహుడు కొలువైన యాదగిరి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో బుధవారం సంప్రదాయ పూజల్లో భాగంగా స్వామి, అమ్మవారి నిత్యకల్యాణం కనువ పండువగా నిర్వహించారు. వేకువజామునే స్వామి వారి మేల్కొలుపులో భాగంగా సుప్రభాత సేవ, అనంతరం ఆరాధన, గర్భాలయంలోని స్వయంభూలను అభిషేకం, సహస్రనామార్చనతో కొలిచారు. అనంతరం ప్రాకార మండపంపై గల ఉత్తరదిశ మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం ఆగమశాస్త్రం ప్రకారం నిర్వహించారు. ఆ తరువాత గజవాహనసేవ, ఉత్సవమూర్తులకు నిత్యకల్యాణ వేడుక, వెండి జోడు సేవోత్సవం వేదమంత్రోచ్ఛరణల మధ్య జరిపించారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చనమూర్తులకు అష్టోత్తర పూజలు చేపట్టారు. వివిధ పూజల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. రాత్రి శ్రీస్వామి వారికి శయనోత్సవం చేసి ఆలయద్వార బంధనం చేశారు.

### వైద్యసిబ్బంది అప్రమత్తంగా ఉండాలి



వైద్యసిబ్బందికి సూచనలు చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

**వలిగొండ :** సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కలెక్టర్ హనుమంతరావు ఆదేశించారు. వలిగొండ మండలంలోని వెల్వర్తి ఆరోగ్య కేంద్రాన్ని బుధవారం ఆయన తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. అనంతరం వైద్యసిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. వర్షాలు కురుస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని, సకాలంలో విధులకు హాజరుకావాలని సూచించారు.

### గవర్నర్‌ను కలిసిన ఎంజీయూ వీసీ



గవర్నర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న వీసీ ఖాజా అల్తాఫ్ హుస్సేన్

**నల్లగొండ టూటౌన్ :** మహాత్మాగాంధీ యూనివర్సిటీ వైస్‌ఛాన్స్‌లర్ ఖాజా అల్తాఫ్ హుస్సేన్ బుధవారం హైదరాబాద్‌లోని రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మను కలిశారు. యూనివర్సిటీలోని పరిణామాలు, అభివృద్ధి కార్యక్రమాలు, విద్యాభివృద్ధి, కోర్సులు తదిరత అంశాలను గవర్నర్‌కు వివరించారు. సెప్టెంబర్ నెలలో యూనివర్సిటీలో నిర్వహించనున్న కాన్వకేషన్‌కు గవర్నర్‌ను ఆహ్వానించారు. ఆయన వెంట రిజిస్ట్రార్ అలువాల రవి, సీఓఈ డాక్టర్ ఉపేందర్‌రెడ్డి ఉన్నారు.

### సంక్షోభంలో విద్యారంగం




సమావేశంలో మాట్లాడుతున్న ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు

**భువనగిరి:** రాష్ట్రంలో విద్యారంగం సంక్షోభంతో ఉందని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి తాళ్ల నాగరాజు అన్నారు. భువనగిరిలోని సాయికృత డిగ్రీ కళాశాలలో జరుగుతున్న విద్యా వైజ్ఞానిక రాజకీయ శిక్షణ తరగుతుల ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యా రంగ సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం అయిందన్నారు. పెండింగ్‌లో ఉన్న రూ. 8వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, ఉపకారవేతనాలు విడుదల చేయకపోవడంతో పేద విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. రాష్ట్రంలో విద్యాశాఖ మంత్రిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఎస్ఎఫ్ఐ రాజీలేని పోరాటాలు చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ కేంద్ర కమిటీ సభ్యురాలు మేడబోయిన మమత, రాష్ట్ర మాజీ అధ్యక్షుడు కల్లూరి మల్లేశం, జిల్లా కార్యదర్శి లావుడియా రాజు, ఉపాధ్యక్షుడు ఈర్ల రాహుల్, సహాయ కార్యదర్శి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు నేహాల్, ఉదయ్, జగన్, కార్తీక్, భవానీ, శంకర్, గాయత్రి, రాణి, ప్రకాష్, నరేందర్, మహేష్, సతీష్ పాల్గొన్నారు.

# వాగులకు వరద

## ఉధృతంగా ప్రవహిస్తున్న బిక్కేరు, మూసీ



మోత్కూరు మండలం పొడిచేడు వద్ద మూసీలో వరద ప్రవాహం

- లో లెవల్ వంతెనల వద్ద రాకపోకలు బంద్
- మూసీ పరీవాహకంలో అలుగుపోస్తున్న 80 చెరువులు
- మిగతా చెరువులు, కుంటలకూ జలకళ
- రుద్రవెల్లి- జూలూరు, సంగెం వద్ద మూసీని పరిశీలించిన సీపీ సుధీర్‌బాబు

**ఆలేరు,మోత్కూరు,యాదగిరిగుట్ట, అడ్డగూడూరు:** భారీ వర్షానికి జిల్లాలో మూసీతో పాటు పలు వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. మూసీ లోలెవల్ వంతెనలు, బిక్కేరు వాగు, నక్కల వాగు వద్ద రాకపోకలు నిలిపివేశారు. రాచకొండ సీపీ సుధీర్‌బాబు ఇతర అధికారులు బుధవారం రుద్రవెల్లి- జూలూరు, సంగెం వద్ద మూసీలో వరదను పరిశీలించారు. జిల్లాలో 1,152 చెరువులు ఉండగా మూసీ పరీవాహకంలోని 80 చెరువులు నిండి అలుగుపోస్తున్నాయి. గుండాల మండలంలో రెండు ఇళ్లు కూలిపోయాయి. రానున్న మూడు రోజులు భారీ వర్ష సూచన నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. ఎటువంటి పరిస్థితులు ఎదురైనా ఎదుర్కొనేందుకు రెస్క్యూ బృందాలను సిద్ధం చేశారు.

**ఆలేరులో..**
పట్టణంలో 26.8 మి. మీ వర్షపాతం నమోదైంది. ఆలేరు పెద్దవాగు ,రత్నాల వాగులో వరదనీరు పారుతోంది. బైరవకుంట, ఎంకుంటలో నీరు చేరుతోంది. పాత మున్సిపల్ కార్యాలయం సమీపంలో, బ్రహ్మంగారి గుడి వద్ద, వడ్లబురాన్ ఇంటి వద్ద వరద కాల్వల్లో పూడికతీయకపోవడం వల్ల వర్షపు నీరు ఇళ్లలోకి చేరడంతో స్థానికులు ఇబ్బందులకు గురయ్యారు. బుధవారం ఉదయం ప్రగతి స్కూల్, పాత మున్సిపల్ కార్యాలయం, కొలనుపాకకు వెళ్లే దారిలోని వంతెన వద్ద వరద నీటిని తహసీల్దార్ పరిశీలించారు. వరదనీరు సాఫీగా వెళ్లేందుకు చర్యలు తీసుకున్నారు. భారీ వర్షాలు కురిస్తే ముంపు పొంచి ఉన్న రంగనాయకుల వీధి, పాత మున్సిపల్ కార్యాలయం, సిల్క్‌నగర్ తదితర లోతట్టు ప్రాంతాలపై అధికారులు దృష్టిసారించారు.

**ఎస్‌డీఆర్ఎస్, అగ్నిమాపక సిబ్బంది రెడీ..**
వరుసగా మూడు రోజుల పాటు భారీ వర్షాలు ఉన్నాయన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అగ్నిమాపక, ఎస్‌డీఆర్ఎస్ సిబ్బంది సిద్ధమైంది. అత్యవసర పరిస్థితులకు ఎదుర్కొనేందుకు 20 మంది ఎస్‌డీఆర్ఎస్, 14మంది అగ్నిమాపక సిబ్బందికి శిక్షణ ఇచ్చారు. రెస్క్యూ బోట్లు, లైఫ్‌బాయ్స్, రోప్స్, లైఫ్ జాకెట్స్, విక్టిమ్ లోకేటింగ్ కెమెరా, కట్టర్స్ తదితర సామగ్రిని అందుబాటులో ఉంచారు.



యాదగిరిగుట్టలో సామగ్రిని సిద్ధం చేసుకుంటున్న ఎస్‌డీఆర్ఎఫ్, అగ్నిమాపక సిబ్బంది

**పెరుగుతున్న భూగర్భ జలాలు**
మోత్కూరు మండలం పొడిచేడు, నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం అమ్మనబోలు మధ్య మూసీ ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో నదికి ఇరు వైపులా గ్రామాల పరిధిలో భూగర్భ జలాలు పెరుగుతున్నాయి. బోర్లు కూడా రీచార్జ్ అవుతుండటంతో రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.

**వాగుల వద్ద కాపాలా..**
అడ్డగూడూరు మండలంలో బుధవారం రాత్రి కురిసిన వర్షానికి వాగుల్లో వరద ప్రవాహం పెరిగింది. అడ్డగూడూరు- గోవిదాపురం మధ్య నక్కల వాగు, వెల్వేవి-చౌల్లగూడెం, అజీంపేట గ్రామాల వద్ద లో లెవల్ బ్రిడ్జిల పైనుంచి వరద నీరు ప్రవహిస్తోంది. తహసీల్దార్ శేషగిరిరావు, ఎంపీడీఓ శంకరయ్య, పోలీసులు ఆయా ప్రాంతాలను పర్యవేక్షించారు. వాగులనుంచి వెళ్లవద్దని ప్రజలకు సూచించారు.



అడ్డగూడూరు మండలం మానాయికుంట వద్ద నిండుగా పారుతున్న మూసీ



అడ్డగూడూరు-గోవిదాపురం మధ్య నక్కలవాగు వద్ద కాపలా కాస్తున్న అధికారులు

### అప్రమత్తంగా ఉండాలి



జూలూరు వద్ద మూసీలో వరదను పరిశీలిస్తున్న సీపీ సుధీర్‌బాబు

**భూదాన్‌పోచంపల్లి, వలిగొండ:** రెడ్ అలెర్ట్ జోన్‌లో ఉన్న యాదాద్రి భువనగిరి జిల్లాలోని లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని రాచకొండ సీపీ సుధీర్‌బాబు అధికారులను ఆదేశించారు. బుధవారం భూదాన్‌పోచంపల్లి మండలంలోని జూలూరు, వలిగొండ మండలంలోని సంగెం వద్ద మూసీలో వరద ఉధృతిని పరిశీలించారు. అధికారులకు సూచనలు చేశారు. పశువులు, గొర్రెల కాపరులు వాగులు, మూసీని దాటే ప్రయత్నంలో ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉన్నందున, రాకపోకలు సాగించకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే శిథిల భవనాల్లో నివసించే వారిని గుర్తించి సురక్షిత ప్రాంతాలకు తరలించాలన్నారు. భారీ వర్షాలు ఉన్నాయని వాతావరణ హెచ్చరికల నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని సూచించారు.కాగా సంగెం వద్ద లో లెవల్ వంతెనపై పేరుకుపోయిన గుర్రపుడెక్కను అధికారులు జేసీబీతో తొలగించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ సీపీ లక్ష్మీనారాయణ, ఏసీపీ మధుసూధన్‌రెడ్డి, ఎంపీడీఓ జలందర్‌రెడ్డి, ట్రాఫిక్ ఏసీపీ ప్రభాకర్‌రెడ్డి, చౌటుప్పల్ రూరల్ సీఐ రాములు, ట్రాఫిక్ సీఐ జయమోహన్, తహసీల్దార్ పి.శ్రీనివాస్‌రెడ్డి, ఎస్ఐ భాస్కర్‌రెడ్డి, ఆర్ఐ గుత్తా వెంకట్‌రెడ్డి, పోలీసు అధికారులు ఉన్నారు.

### హర్‌ఘర్ తిరంగా ర్యాలీ



చౌటుప్పల్ పట్టణంలో బుధవారం బీజేవైఎం ఆధ్వర్యంలో నిర్వహించిన హర్‌ఘర్ తిరంగా ర్యాలీలో పాల్గొన్న యువత, విద్యార్థులు, నాయకులు -చౌటుప్పల్

# గురుకులాల్లో వంటకు తంటా..

**జీఓ 17ను నిరసిస్తూ కేటరింగ్ కాంట్రాక్టర్ల సమ్మెబాట**

- వంట సిబ్బంది సైతం విధులకు గైర్హాజరు
- విద్యార్థులకు సమయానికి అందని అల్పాహారం, భోజనం
- ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



రాజాపేట గురుకులంలో అల్పాహారం వడ్డిస్తున్న విద్యార్థి

**సాక్షి,యాదాద్రి:** విద్యార్థులే వంట మనుషులుగా మారారు. స్వయంగా వంటలు చేసి వారే వడ్డించుకున్నారు. అల్పాహారం, గురుకులాల్లో వంట కాంట్రాక్టర్లు సమ్మెబాట పట్టారు. ప్రభుత్వం నూతనంగా తీసుకువచ్చిన జీఓ 17ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్సీ, బీసీ, మైనార్టీ సంక్షేమ గురుకులాలు, కస్తూరిబాగాంధీ విద్యాలయాల్లో భోజనం వండి వడ్డించే కాంట్రాక్టర్లు సమ్మెలోకి వెళ్లారు. దీంతో బుధవారం విద్యార్థులకు సమయానికి అల్పాహారం, భోజనం అందలేదు.

**కొత్త టెండర్ విధానం..**
ప్రభుత్వం ఈ విద్యాసంవత్సరం నుంచి నూతన టెండర్ విధానం అమల్లోకి తెచ్చింది. కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, పాలు సరఫరా చేసే కాంట్రాక్టర్లు రూ.లక్షల్లో డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ఇందుకు సంబంధించి జీఓ 17 జారీ చేసింది. ఇప్పటికే బిల్లులు సకాలంలో అందక కాంట్రాక్టర్లు ఇబ్బంది పడుతున్నారు. అప్పులు చేసి వస్తువులు సరఫరా చేస్తున్నారు. తాజాగా ప్రభుత్వం విడుదల చేసిన జీఓ కాంట్రాక్టర్లకు ఆర్థికంగా మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెట్టేలా ఉంది. పాత నిబంధనల ప్రకారమే టెండర్లు పిలవాలని కాంట్రాక్టర్లు ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం నుంచి స్పందన లేకపోవడంతో కేటరింగ్ కాంట్రాక్టర్లు సమ్మెలోకి దిగారు.

**విధులకు రాని వంట సిబ్బంది**
కేటరింగ్ కాంట్రాక్టర్లు సమ్మెలోకి దిగడంతో వంట సిబ్బంది విధులకు హాజరు కాలేదు. భువనగిరి, రాజాపేట, ఆలేరు, బీబీనగర్ సోషల్ వెల్ఫేర్, ఆలేరు, మోటకొండూరు, బీబీనగర్, దేశ్‌ముఖి బీసీ వెల్ఫేర్ గురుకులాల్లో సిబ్బంది హాజరు తగ్గింది. హాజరైన ఒకరిద్దరికి తోడుగా బయటినుంచి మహిళలను కూలికి రప్పించి వంటలు చేయించారు. కొన్ని చోట్ల వాచ్‌మన్‌లు, అటెండర్‌లు, స్కావెంజర్‌లతో, మరికొన్ని పాఠశాలల్లో విద్యార్థులే వంటలు చేసి స్వయంగా భోజనం వడ్డించుకున్నారు. చాలా చోట్ల ఉదయం అల్పాహారం చేయలేదు. జావాకాచి పోశారు. విద్యార్థుల భోజనానికి ఇబ్బంది రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని ప్రభుత్వం నుంచి ప్రిన్సిపాళ్లకు ఆదేశాలు జారీ చేయడంతో తాత్కాలికంగా కొంతమంది వర్కర్లను తీసుకుంటున్నారు.

**నిలిచిపోనున్న సరుకులు!**
ప్రస్తుతం గురుకులాల్లో కిరాణ సరుకులు సరిపడా ఉన్నాయి. అయితే విద్యార్థులకు వారంలో రెండు దఫాలు చికెన్, మటన్‌తో భోజనం పెట్టాలి. తాజా పరిస్థితులు చూస్తుంటే సరుకులు నిలిచిపోయే అవకాశం కనిపిస్తుంది.

# రైతులు నష్టపోకుండా డబ్ల్యూడీఆర్‌ఏ

- ఐసీఎం ప్రోగ్రాం డైరెక్టర్ శ్యామ్‌కుమార్



సమావేశంలో మాట్లాడుతున్న శ్యామ్‌కుమార్

**మోత్కూరు:** రైతులు ఆరుగాలం శ్రమించి పండించిన పంటను తక్కువ ధరకు విక్రయించి నష్టపోతున్నారని, దీన్ని నివారించేందుకు కేంద్ర ప్రభుత్వం వేర్‌హౌజింగ్ డెవలప్‌మెంట్ అండ్ రెగ్యులేటరీ అథారిటీ (డబ్ల్యూడీఆర్‌ఏ) ఏర్పాటు చేసిందని.. ఇనిస్టిట్యూట్ ఆఫ్ కోఆపరేటివ్ మేనేజ్‌మెంట్ (ఐసీఎం)ప్రోగ్రాం డైరెక్టర్ శ్యామ్‌కుమార్ తెలిపారు. మోత్కూరు మండల కేంద్రంలోని ఎఫ్ఎస్‌సీఎస్ డబ్ల్యూడీఆర్‌ఏపై బుధవారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులు పండించిన పంటలను అమ్ముకునే సమయంలో గిట్టుబాటు ధర దక్కకపోవడం, నిల్వ ఉంచుకునే పరిస్థితి ఉండటం లేదన్నారు. పంట పెట్టుబడులకు చేసిన అప్పులు తీర్చడానికి తక్కువ ధరకు అమ్ముకుంటున్నారని పేర్కొన్నారు. ఈ పరిస్థితిని నివారించి అధిక ధర వచ్చినప్పుడు పంటను అమ్ముకునే సౌకర్యం కల్పిస్తూ ప్రభుత్వం ఎక్కడికక్కడ వేర్‌హౌజింగ్ గోదాములను ఏర్పాటు చేస్తుందన్నారు. రైతులు తాము పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు ఈ గోదాముల్లో నామమాత్రపు రుసుముతో పంట ఉత్పత్తులు నిల్వ చేసుకోవచ్చని సూచించారు. నిల్వ చేసిన పంటపై 80 శాతం వరకు బ్యాంకులు తక్షణ రుణ సదుపాయం కల్పిస్తాయన్నారు. అనంతరం రైతులకు శిక్షణ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ రామనర్సయ్య, గోదాం మేనేజర్ వీరబాబు, సింగిల్‌విండో చైర్మన్ పి.వెంకటేశ్వర్లు, సీఈఓ వరలక్ష్మి, వైస్ చైర్మన్ బండ పద్మ, డైరెక్టర్లు స్వామి, లక్ష్మయ్య, ముత్తయ్య, రాములు, మల్లయ్య, సుజాత, రైతులు పాల్గొన్నారు.

### ఎన్‌సీసీతో క్రమశిక్షణ

**వలిగొండ :** విద్యార్థులు ప్రాథమిక దశలో ఎన్‌సీసీలో చేరితే క్రమశిక్షణ అలవడుతుందని, కేడెట్లుగా వారు చేసే కార్యక్రమాలు భవిష్యత్‌కు ఎంతో ఉపయోగపడుతాయని లెఫ్టినెంట్ కల్నల్ శశిధర్ రావు తెలిపారు. 2025-26 విద్యా సంవత్సరానికి గాను నల్లగొండ బెటాలియన్ ఆధ్వర్యంలో బుధవారం వలిగొండలోని శ్రీవెంకటేశ్వర ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్‌సీసీలో చేరడం వల్ల ఉన్నత విద్యలో ప్రవేశాలకు, ఉద్యోగాల్లో ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎం మాధవరావు, సుబేదార్ కొమ్ము లక్ష్మయ్య, కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మీకాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# మాదకద్రవ్యాలను అరికడదాం



కలెక్టరేట్‌లో ప్రతిజ్ఞ చేస్తున్న ఉద్యోగులు

**భువనగిరిటౌన్:** సమష్టి కృషితో మాదకద్రవ్యాలకు అడ్డుకట్టవేయాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం కలెక్టరేట్‌లో మహిళాశిశు, వయో వృద్ధులు, దివ్యాంగుల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం సాగిస్తున్న పోరాటంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ జయమ్మ, శిశు సంక్షేమ శాఖ అధికారి నరసింహారావు, అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ జగన్‌మోహన్ ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేయిస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

### • అదుపు తప్పితే ప్రమాదమే..



**తుర్కపల్లి :** తుర్కపల్లి మండలం మల్కాపూర్ గ్రామంలోని కల్వర్టు వద్ద రోడ్డు అధ్వానంగా మారింది. ఈ మార్గంలో నిత్యం వందలాది వాహనాలు వెళ్తుండగా కల్వర్టు వద్ద గుంతలు ఏర్పడి ప్రమాదాలకు నెలవుగా మారింది. ఈ గుంతల్లో వర్షపు నీరు నిల్వ ఉండడంతో వాహనదారులు రోడ్డు పరిస్థితిని అంచనా వేయలేకపోతున్నారు.

# రైతు సంక్షేమంపై రాజీపడం

- ప్రభుత్వ విప్ ఐలయ్య, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి



పీఏసీఎస్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ప్రభుత్వ విప్ ఐలయ్య, డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

**రాజాపేట:** రైతు సంక్షేమంపై రాజీపడబోమని ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. రాజాపేట మండలం రేణికుంట ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం కార్యాలయం, గోదాంలను బుధవారం వారు ప్రారంభించారు. పీఏసీఎస్ చైర్మన్ చింతలపురి భాస్కర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమానికి ప్రాధాన్యమిస్తుందని, అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర కాలంలోనే రూ.లక్ష కోట్లు ఖర్చు చేసిందన్నారు. పీఏసీఎస్ కేంద్రాల ద్వారా కొనుగోలు చేసిన ధాన్యానికి మూడు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో ప్రభుత్వం డబ్బులు జమ చేసిందన్నారు. ఎరువులకు ఇబ్బంది తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని, అవసరం మేరకు ఎరువులు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీసీఈఓ శోభారాణి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఐనాల చైతన్య మహేందర్‌రెడ్డి, డైరెక్టర్లు సిలివేరు బాలరాజు గౌడ్, విఠల్ నాయక్, తహసిల్దార్ అనిత, ఎంపీడీఓ నాగవేణి, పీఏసీఎస్ డైరెక్టర్లు, సీఈఓ శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## క్లుప్తంగా

### అత్యాచారం కేసులో 26 ఏళ్ల జైలు శిక్ష

రామగిరి(నల్లగొండ): బాలికపై అత్యాచారానికి పాల్పడిన వ్యక్తికి 26 ఏళ్ల జైలు శిక్ష విధిస్తూ నల్లగొండ పోక్సో కోర్టు జడ్జి రోజారమణి బుధవారం తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. నల్లగొండ పట్టణంలోని లైన్ వాడకు చెందిన గ్యారాల శివకుకుమార్ బీటీఎస్ ప్రాంతానికి చెందిన వసంతపురి యాదమ్మతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడు. మైనర్ అయిన యాదమ్మ కూతురుపై కూడా కన్నేశాడు. యాదమ్మ సహకారంతో శివకుమార్ ఆమె కుమార్తెపై అత్యాచారానికి పాల్పడ్డాడు. బాధిత బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు 2023 మే 8న నల్లగొండ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో యాదమ్మ, శివకుమార్‌పై కేసు నమోదు చేసి వారిద్దరిని కోర్టులో హాజరుపర్చారు. మంగళవారం కోర్టు విచారణలో యాదమ్మ హాజరు కాగా 22 ఏళ్ల జైలు శిక్ష రూ.5వేల జరిమాన విధిస్తూ జడ్జి తీర్పు వెలువరించింది. శివకుమార్ పారిపోవడంతో కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. నల్లగొండ టూటౌన్ పోలీసులు నిందితుడిని చాకచక్యంగా పట్టుకుని బుధవారం కోర్టులో హాజరుపరిచారు. జడ్జి విచారణ జరిపి శివకుమార్‌కు 26 ఏళ్ల జైలు శిక్ష, రూ.40వేల జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించారు. ప్రాసిక్యూషన్ తరఫున స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ వేముల రంజిత్‌కుమార్ వాదనలు వినిపించారు.

### విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

నార్కట్‌పల్లి: విద్యుదాఘాతంతో పానీపూరి బండి నిర్వాహకుడు మృతిచెందాడు. ఈ ఘటన నార్కట్‌పల్లి మండల కేంద్రంలో బుధవారం రాత్రి జరిగింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నార్కట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన రమావంత్ రమేష్(39) కొన్నేళ్లుగా స్థానిక బస్టాండ్ ఎదురుగా పానీపూరి బండి నడిపిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. బుధవారం రాత్రి వర్షం కురుస్తుండగా.. పానీపూరి బండికి ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్ వెలగకపోవడంతో దానిని సరిచేస్తుండగా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే మృతిచెందాడు. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ క్రాంతికుమార్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### చికిత్స పొందుతూ..


పద్మయ్య (ఫైల్)

తుంగతుర్తి: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడి బంధువులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తుంగతుర్తి మండలం అన్నారం గ్రామానికి చెందిన బుర్ర పద్మయ్య(62) తన టీవీఎస్ ఎక్సెల్‌పై సోమవారం తుంగతుర్తికి వెళ్లి ఇంటికి తిరిగి వస్తుండగా.. అన్నారం ఎక్స్ రోడ్ సమీపంలో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. అతడి తలకు తీవ్రగాయాలు కాగా.. చికిత్స నిమిత్తం తుంగతుర్తి ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లగా.. చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ తెలిపారు. తుంగతుర్తి ఏరియా ఆస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు పేర్కొన్నారు.

### పోస్టుమాస్టర్ అరెస్ట్

అడ్డగూడూరు: ఖాతాదారుల డబ్బులు వాడుకుని మోసం చేసిన పోస్టుమాస్టర్‌ను అడ్డగూడూరు పోలీసులు బుధవారం అరెస్ట్ చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మఠంపల్లి మండలం చెన్నాయిపాలెం గ్రామానికి చెందిన మాలోతు దుర్గాప్రసాద్ అడ్డగూడూరు మండలం డి. రేపాక గ్రామ పోస్టుమాస్టర్‌గా 2022 నుంచి 2023 వరకు పనిచేశాడు. ఆ సమయంలో ఐదుగురు ఖాతాదారులు డిపాజిట్ చేసిన రూ.53వేల నగదును దుర్గాప్రసాద్ తన సొంతానికి వాడుకున్నాడు. 2025 మే నెలలో ఖాతాదారులు తమ ఖాతాల్లో డబ్బులు లేవని గుర్తించి దుర్గాప్రసాద్‌పై ఫిర్యాదు చేయగా.. పోలీసులు కేసు నమోదు చేశారు. దుర్గాప్రసాద్‌ను అరెస్ట్ చేసి రామన్నపేట కోర్టులో హాజరుపర్చినట్లు ఎస్‌ఐ వెంకట్‌రెడ్డి తెలిపారు.

# పింఛన్‌దారులను మోసం చేసిన సీఎం

- రాజీనామా చేసి ఇంటికెళ్లేందుకు రేవంత్‌రెడ్డి సిద్ధంగా ఉండాలి
- కాంగ్రెస్ మోసాలను ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నేత.. గడీలో పడుకుండు
- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ



మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ

ఆలేరు: రాష్ట్రంలో 50లక్షల మంది పింఛన్‌దారులను మోసం చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని పరిపాలించే నైతిక హక్కును కోల్పోయారని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. బుధవారం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరులో జరిగిన చేయూత పింఛన్‌దారుల నియోజకవర్గ స్థాయి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. వృద్ధులు, దివ్యాంగులు, వితంతు పింఛన్‌లను పెంచుతానని హామీలతో ఓట్లడిగిన రేవంత్‌రెడ్డి.. పేద వర్గాలను నమ్మించి మోసం చేశారన్నారు. కాంగ్రెస్ సర్కారు మోసాలను ప్రశ్నించాల్సిన ప్రతిపక్ష నేత కేసీఆర్.. గడీలో పడుకున్నాడని ఆయన వ్యాఖ్యానించారు. ప్రభుత్వ వైఫల్యాలను, మోసాలను ప్రతిపక్ష నేతగా ప్రశ్నించాల్సిన బాధ్యత కేసీఆర్ లేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ పరిపాలన చాలని ప్రతిపక్షంలో కూర్చొబెట్టినా, అక్కడా ఆయన విఫలమయ్యారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను మోసం చేస్తున్నా ప్రజల్లోకి రాకుండా, అసెంబ్లీకి వెళ్లకుండా ప్రతిపక్ష నేత మౌనంగా ఉండటాన్ని ఆయన తీవ్రంగా దుయ్యబట్టారు. బంగ్లాలో, గడీలో పుట్టిన భూస్వాములు రేవంత్‌రెడ్డి, కేసీఆర్‌లకు పూరిగుడిసెలో ఉండే పేదల కష్టాలు అర్థం కావని మండిపడ్డారు. సెప్టెంబర్ 3లోపు కొత్త పింఛన్‌ల మంజూరుతోపాటు ఇచ్చిన హామీ మేరకు పింఛన్‌లను పెంచకపోతే సీఎం రేవంత్‌రెడ్డి తన పదవికి రాజీనామా చేసి ఇంటికి వెళ్లడానికి సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. వచ్చే నెల 3న తలపెట్టిన మహాగర్జన సభకు పింఛన్‌దారులు అధికసంఖ్యలో తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. వికలాంగుల హక్కుల పోరాట సమితి (వీహెచ్‌పీఎస్) నాయకుడు జాలపు సిద్ధారెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో వీహెచ్‌పీఎస్ నాయకుడు ధనుంజయ్యగౌడ్, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ, వీహెచ్‌పీఎస్ నాయకులు, పింఛన్‌దారుల సంఘం ప్రతినిధులు అశోక్, జహంగీర్, ఉస్మాన్, సత్తయ్య మహేందర్‌మాదిగ, చంద్రస్వామి మాదిగ రామకృష్ణమాదిగ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పాలనలో యూరియా కష్టాలు

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శ


మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత

కేతేపల్లి: రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియాను సరఫరా చేయటంతో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, కాంగ్రెస్ పాలనలో మళ్లీ యూరియా కష్టాలు మొదలయ్యాయని తెలంగాణ జాగృతి రాష్ట్ర అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. బుధవారం కేతేపల్లి మండలంలోని భీమారం గ్రామంలో జాగృతి కార్యకర్త కూతురు జన్మదిన వేడుకకు హాజరైన ఆమె మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. పదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో లేని యూరియా కొరత ఇప్పుడు మళ్లీ మొదలయిందన్నారు. కేసీఆర్ హయాంలో సీజన్‌కు ముందే కేంద్ర ప్రభుత్వం నుంచి యూరియా నిల్వలను తెప్పించి రైతులకు సకాలంలో సరఫరా చేసిన చరిత్ర బీఆర్‌ఎస్ పార్టీదన్నారు. రాష్ట్రంలో రైతులకు అవసరమైన యూరియా నిల్వలను కేంద్రం నుంచి తీసుకరావటంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందని, తెలంగాణ వ్యాప్తంగా ఎక్కడ చూసినా యూరియా కోసం రైతులు పడిగాపులు కాస్తున్నారని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు కేంద్రంపై కొట్లాడి రైతులకు సరిపడా యూరియాను తీసుకురావాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పింఛన్ల పెంపు వెంటనే అమలు చేయాలన్నారు.

## నిరంతరం అప్రమత్తతతో విద్యుత్ సేవలు

- టీజీఎస్‌పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ శివాజీ


మాట్లాడుతున్న ప్రాజెక్టు డైరెక్టర్ శివాజీ

నేరేడుచర్ల: రాష్ట్ర వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండడంతో నిరంతరం అప్రమత్తతతో విద్యుత్ శాఖ సేవలను అందిస్తుందని టీజీఎస్‌పీడీసీఎల్ ప్రాజెక్టు డైరెక్టర్ శివాజీ అన్నారు. బుధవారం నేరేడుచర్లలోని ట్రాన్స్‌కో కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వరదల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడితే వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. మెడికల్, ఎమర్జెన్సీ మినహా విద్యుత్ ఉద్యోగులకు సెలవులను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. ఫ్యూజ్ ఆఫ్ కాల్ నుంచి ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మతులు, విద్యుత్ లైన్ల మరమ్మతులు, తదితర అవసరాల నిమిత్తం 1912 టోల్‌ఫ్రీ నంబర్‌ను అందుబాటులో ఉంచామన్నారు. ఓపెనింగ్ మానిటరింగ్ సిస్టం ద్వారా ఎక్కడైనా విద్యుత్ సమస్య తలెత్తితే వెంటనే తెలిసిపోతుందన్నారు. వెంటనే విద్యుత్ సిబ్బంది అప్రమత్తమై మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. రైతులు, ప్రజలు విద్యుత్ మరమ్మతులు సొంతంగా చేపట్టవద్దన్నారు. ఈ సమావేశంలో హుజూర్‌నగర్ విద్యుత్ డీఈ వెంకటేశ్వర్లు, నల్లగొండ టెక్నికల్ డీఈ కృష్ణారావు, ఏడీ నాగిరెడ్డి, నేరేడుచర్ల, పాలకీడు మండలాల ఏఈలు రవివర్మ, శ్రీనివాస్ తదితరులున్నారు.

## మద్యం తాగొద్దన్నందుకు వ్యక్తి ఆత్మహత్య


లింగారెడ్డి (ఫైల్)

గుర్రంపోడు: తల్లి సంవత్సరీకం రోజున మద్యం తాగొద్దన్నందుకు మనస్తాపానికి గురైన వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన బుధవారం గుర్రంపోడు మండల కేంద్రంలో జరిగింది. ఎస్‌ఐ పసుపులేటి మధు తెలిపిన వివరాల ప్రకారం.. గుర్రంపోడు మండలకేంద్రానికి చెందిన మోపూరి లింగారెడ్డి(58) మంగళవారం రాత్రి తన తల్లి సంవత్సరీకం సందర్భంగా కుటుంబ సభ్యులు, బంధువులతో కలిసి ఇంట్లో మద్యం తాగుతున్నాడు. మద్యం ఎక్కువగా తాగుతున్నావు, లేచి అన్నం తిను అని కుటుంబ సభ్యులు మందలించడంతో మనస్తాపానికి గురై పురుగుల మందు తాగాడు. కుటుంబ సభ్యులు గమనించి అతడిని 108 వాహనంలో నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య గోవిందమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధం


బాధితులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఆర్డీఓ వేణుమాధవ్‌రావు

ఆత్మకూర్(ఎస్)(సూర్యాపేట): షార్ట్‌సర్క్యూట్‌తో పూరి గుడిసె దగ్ధమైన ఘటన ఆత్మకూర్(ఎస్) మండల పరిధిలోని పాత సూర్యాపేట గ్రామంలో మంగళవారం అర్ధరాత్రి జరిగింది. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. పాత సూర్యాపేట గ్రామానికి చెందిన ఎడవెల్లి మల్లయ్య మంగళవారం రాత్రి తాను నివాసముంటున్న పూరి గుడిసెలో కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. అర్ధరాత్రి షార్ట్‌సర్క్యూట్ కారణంగా గుడిసెలకు మంటలు అంటుకున్నాయి. మంటలను గమనించిన మల్లయ్య కటుంబ సభ్యులు కేకలు వేస్తూ బయటకు పరుగు తీశారు. గుడిసెతో పాటు అందులోని వస్తువులు, నిత్యావసర సరుకులు కాలిబూడిదయ్యాయి. సమాచారం తెలుసుకున్న సూర్యాపేట ఆర్డీఓ వేణుమాధవ్‌రావు తహసీల్దార్ అమీన్‌సింగ్‌తో కలిసి గ్రామానికి చేరుకుని కాలిపోయిన పూరి గుడిసెను పరిశీలించి బాధిత కుటుంబ సభ్యులకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు.

### ఢిల్లీలో స్వాతంత్య్ర వేడుకలకు ఆహ్వానం


గూడూరు నాగేశ్వర్‌రావు

సూర్యాపేట: ఢిల్లీలోని ఎర్రకోటలో ఆగస్టు 15న జరగబోయే స్వాతంత్య్ర వేడుకల్లో పాల్గొనాలని యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గూడూరు నాగేశ్వర్‌రావుకి కేంద్ర ప్రభుత్వం నుంచి ఆహ్వానం అందింది. ఈ సందర్భంగా నాగేశ్వర్‌రావుకు బుధవారం అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు తీకుళ్ల సాయిరెడ్డి, ఉపాధ్యక్షురాలు వందనపు శ్రీదేవి అభినందనలు తెలిపారు. ఢిల్లీలో జరిగిన రెండవ ఏషియన్ యోగాసన స్పోర్ట్స్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ తరఫున నాగేశ్వర్‌రావు పాల్గొని పతకాలు సాధించడంతో ఆయన ప్రత్యేక ఆహ్వానం లభించిందని పేర్కొన్నారు. తెలంగాణ నుంచి గూడూరు నాగేశ్వరరావు ఒక్కరికే ఈ అవకాశం రావడం గర్వకారణమన్నారు.

### బాలసదన్ నుంచి ఇద్దరు బాలికలు పరారీ

- ఆరు గంటల్లోనే హైదరాబాద్‌లో పట్టుకున్న పోలీసులు


బాలికలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న నల్లగొండ టూటౌన్ పోలీసులు

నల్లగొండ: నల్లగొండ పట్టణంలోని బాలసదన్ నుంచి మంగళవారం అర్ధరాత్రి ఇద్దరు బాలికలు పారిపోయారు. బాలసదన్ నిర్వాహకుల ఫిర్యాదు మేరకు నల్లగొండ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకొని సీసీ పుటేజీలను పరిశీలించి వారిద్దరు హైదరాబాద్‌లో ఉన్నట్లు గుర్తించారు. ఆరు గంటల్లోనే బాలికలను పట్టుకుని సంరక్షణ అధికారుల సమక్షంలో కుటుంబ సభ్యులకు అప్పగించారు. తక్కువ సమయంలో బాలికల ఆచూకీ కనిపెట్టిన టూటౌన్ ఎస్‌ఐ సైదులు, పోలీస్ సిబ్బంది రాజు, బాలకోటిని డీఎస్పీ శివరాంరెడ్డి అభినందించారు.

### వరదలో కొట్టుకుపోయిన బైక్


వరదలో నుంచి బైక్‌ను లాగుతున్న వ్యక్తులు

మేళ్లచెరువు: చింతలపాలెం మండలంలో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. బుధవారం సాయంత్రం పులిచింతల ప్రాజెక్టు నుంచి వజినేపల్లి వెళ్లే రోడ్డులో వాగు ఉధృతంగా ప్రవహించింది. ఈ దారిలో బైక్‌పై వస్తున్న ఇద్దరు వ్యక్తులు వాగు దాటుతుండగా.. బైక్ వరదలో కొట్టుకుపోయింది. మరో వ్యక్తి సైతం బైక్‌పై వాగు దాటుతుండగా.. కొంతదూరం వరదకు కొట్టుకుపోయి ఒడ్డుకు చేరుకున్నాడు.

## 104 అడుగుల జాతీయ జెండాతో ర్యాలీ




సూర్యాపేట: స్వాతంత్య్ర దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరాలని వాసవీ యూత్ క్లబ్ అధ్యక్షుడు వెంపటి రవితేజ అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని కొత్త బస్టాండ్ నుంచి తిరంగా జెండా ర్యాలీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. త్రివర్ణ పతాకం ఇళ్లపై ఎగురవేయడం ద్వారా ప్రతిఒక్కరిలో జాతీయభావం పెంపొందుతుందన్నారు. అనంతరం కొత్త బస్టాండ్, శంకర్ విలాస్ సెంటర్, కల్నల్ సంతోష్‌బాబు విగ్రహం వరకు 104 అడుగుల భారీ జాతీయ జెండాతో జయ స్కూల్ విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్, వాసవీ యూత్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు, నిర్వాహకులు

## నూతన పద్ధతులపై అవగాహన కల్పించాలి

- దక్షిణ తెలంగాణ మండలి సహ పరిశోధన సంచాలకుడు రాంప్రకాష్


కేవీకే కంపాసాగర్‌లో గొర్రెల పెంపకం షెడ్డును పరిశీలిస్తున్న రాంప్రకాష్

త్రిపురారం: వ్యవసాయంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గ్రామీణ ప్రాంతాల్లో రైతులకు నూతన వ్యవసాయ పద్ధతులపై ఎప్పటికప్పుడు గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి అవగాహన కల్పించాలని దక్షిణ తెలంగాణ మండలి(ఏడీఆర్) సహ పరిశోధన సంచాలకుడు డాక్టర్ రాంప్రకాష్ సూచించారు. బుధవారం త్రిపురారం మండలంలోని కంపాసాగర్ కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే)ను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా కేవీకేలో వరి, కంది విత్తనోత్పత్తి ప్రదర్శనలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. వరి పంట, కూరగాయల సాగు, గొర్రెల పెంపకం షెడ్లను పరిశీలించి పలు సూచనలు చేశారు. కేవీకే కంపాసాగర్ ఆధ్వర్యంలో రైతుల కోసం చేపడుతున్న కార్యక్రమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ రాజ్‌కుమార్, సేద్యపు విభాగం శాస్త్రవేత్త చంద్రశేఖర్, సస్యరక్షణ శాస్త్రవేత్త రాములమ్మ, ఉద్యానవన శాస్త్రవేత్త హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఇంటర్వ్యూ

- హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో హాజరైన పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ బయోలజీ టీచర్


ఇంటర్వ్యూకు హాజరైన మారం పవిత్రను అభినందిస్తున్న నవీన్ నికోలస్ తదితరులు

పెన్‌పహాడ్: జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కోసం దరఖాస్తు చేసుకున్న పెన్‌పహాడ్ జెడ్పీహెచ్‌ఎస్ బయోలజీ టీచర్ మారం పవిత్ర బుధవారం నేషనల్ జ్యూరీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ కార్యాలయంలో నిర్వహించిన ఇంటర్వ్యూకు హాజరయ్యారు. సెప్టెంబర్ 5న జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం రోజున జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు అందజేయనున్నారు. ఇందు కోసం రాష్ట్రం వ్యాప్తంగా 107మంది ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకున్నారు. వీరికి ఆన్‌లైన్ ద్వారా 21 ప్రశ్నావళి ఇచ్చి సరైన సమాధానాలు ఇచ్చిన 77మందిని స్టేట్ కమిటీ ఎంపిక చేసింది. వీరిలో నుంచి ఎంపిక చేసిన 15మందిని ఢిల్లీ నుంచి వచ్చిన నేషనల్ జ్యూరీ సభ్యురాలు ఇంటర్వ్యూ చేసి ఆరుగురిని ఎంపిక చేశారు. ఈ ఆరుగురి మారం పవిత్ర ఉండగా.. వీరు బుధవారం హైదరాబాద్‌లోని విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి వెళ్లి ఢిల్లీ నుంచి గూగుల్ మీట్ ద్వారా నిర్వహించిన ఆన్‌లైన్ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ ఆరుగురిలో నుంచి ఇద్దరు లేదా ముగ్గురిని జాతీయ అవార్డుకు ఎంపిక చేస్తారని ఆమె చెప్పారు. ఇంటర్వ్యూలో పాల్గొన్న పవిత్రను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, జాయింట్ డైరెక్టర్ మదన్ మోహన్, ఆర్‌జేడీ విజయలక్ష్మి అభినందించారు.

## వరి కోత మిషన్ చోరీకి యత్నం.. నలుగురి అరెస్ట్

చిలుకూరు: చిలుకూరు మండల పరిధిలోని సీత రాంపురం గుట్టల్లో నిరుపయోగంగా ఉన్న వరి కోత మిషన్‌ను చోరీ చేసేందుకు యత్నించిన నలుగురిని మంగళవారం రాత్రి స్థానిక పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సీత రాంపురం గుట్టల్లోని పొలాల వద్ద గత సీజన్‌లో వరి కోత మిషన్ చెడిపోవడంతో అక్కడే ఉంచారు. వరి కోత మిషన్‌కు సంబంధించి ఇద్దరు యజమానుల మధ్య నెలకొన్న వివాదాల కారణంగా దానిని పట్టించుకున్నవారే కరువయ్యారు. వరి కోత మిషన్ నిలిపిన ప్రదేశం కోదాడ–జడ్చర్ల జాతీయ రహదారి సమీపంలో గుట్టల్లో ఉంటుంది. అటువైపు చుట్టుపక్కల రైతులు తప్ప ఎవరూ వెళ్లరు. అయితే కొద్దిరోజులు క్రితం వరి కోత మిషన్‌లో బ్యాటరీలు చోరీకి గురయ్యాయి. నిరుపయోగంగా ఉన్న వరి కోత మిషన్‌ను అపహరించాలని గుర్తుతెలియని వ్యక్తులు పథకం రచించారు. మిషన్ మొత్తాన్ని ఒకేసారి తీసుకెళ్లాలంటే లారీ కావాల్సి వస్తుందని గ్రహించి.. ఒక క్రేన్, ట్రాలీ ఆటో మాట్లాడుకున్నారు. పథకం ప్రకారం మంగళవారం రాత్రి 10గంటల సమయంలో ఆ ప్రదేశానికి వెళ్లారు. క్రేన్ సహాయంతో వరి కోత మిషన్‌లో ప్రధానమైన రెండు చైన్ ట్యాకర్స్‌ను, హైడ్రాలిక్‌లను తొలగించారు. అదేవిధంగా ఇతర విడిభాగాలను మిషన్ నుంచి వేరు చేశారు. అటుగా వెళ్తున్న ఓ రైతు ఇదంతా గమనించి గతంలో ఆ వరి కోత మిషన్‌ను కమిషన్‌పై నడిపించిన చిలుకూరుకు చెందిన కొల్లు నాగయ్యకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చాడు. వెంటనే నాగయ్య కొంతమందిని తీసుకొని వరి కోత మిషన్ వద్దకు వెళ్లేసరికి దొంగలు క్రేన్ సహాయంతో ట్రాలీ ఆటోలో విడి భాగాలను ఎక్కించారు. పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు వచ్చి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. వరి కోత మిషన్ విలువ రూ.15 లక్షలకు పైనే ఉంటుందని తెలిసింది. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు చిలుకూరు ఎస్‌ఐ సురేష్‌రెడ్డి తెలిపారు. క్రేన్, ట్రాలీ ఆటోను సీజ్ చేసినట్లు పేర్కొన్నారు.



## అధిక వర్షాలకు పంటల రక్షణ ఇలా..


పెద్దవూర మండలంలో నీట మునిగిన పత్తి చేను

పెద్దవూర: గత మూడు రోజులుగా ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో పత్తి, మిరప, పప్పుదినుసుల పంటలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. ఈ పంటలు నీటిలో మునగడంతో వాటికి చీడపీడల సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది. సకాలంలో పంటల రక్షణ చర్యలు చర్యలు చేపట్టకపోతే దిగుబడులు తగ్గిపోయే ప్రమాదం ఉంది. రైతులు పాటించాల్సిన జాగ్రత్తలను పెద్దవూర మండల వ్యవసాయ అధికారి సందీప్ వివరించారు.

**పత్తి పంట:**

- సాధ్యమైనంత వరకు చేనులో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. ఎప్పటికప్పుడు కాల్వలను ఏర్పాటు చేసుకుని నీటిని తొలగించాలి.
- వర్షాలు తగ్గిన వెంటనే వీలైనంత త్వరగా భూమిలో తేమను తగ్గించేందుకు అంతర సేద్యం చేయాలి.
- అంతర సేద్యం చాలారోజుల వరకు వీలుకాకపోతే, కలుపు సమస్య ఎక్కువగా ఉంటే విత్తిన 45–60 రోజుల పైరులో ఎకరాకు 400 మి.లీ., క్విజల్ ఫాస్ ఇథైల్+పైరిథయోబాక్ సోడియం 250 మి.లీ. కలిపి పిచికారీ చేసి కలుపును నివారించుకోవాలి.
- వర్షాలు తగ్గాక వెంటనే బురద పదునులో ఎకరాకు 30 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్‌ను పైపాటుగా వేయాలి. లీటరు నీటికి 10 గ్రాముల పొటాషియం నైట్రేట్, 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ కలిపి ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని పిచికారీ చేయాలి.
- విత్తిన సమయంలో భాస్వరం ఎరువును వేయని రైతులు ఎకరాకు 50 కిలోల డీఏపీ ఎరువు వేసుకోవచ్చు.
- ఆకుపచ్చ తెగుళ్ల తీవ్రత పెరగడానికి అవకాశం ఉన్నందున వర్షాలు తగ్గాక సాఫ్ లేదా కంపానియన్ అనే శిలీంధ్రనాశిని మందు 2 గ్రాముల చొప్పున, అలాగే ప్లాంటోమైసిన్ లేదా స్ట్రెప్టోసైక్లిన్ 0.2 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- పత్తిలో వర్షాలు తెరిపి ఇచ్చిన తర్వాత పిండినల్లి ఉధృతి ఎక్కువయ్యే అవకాశం ఉంది. దీని నివారణకు గాను లీటరు నీటికి 1 మి.లీ. డైక్లోరోఫాస్‌తో పాటు 2మి.లీ. ప్రొఫినోఫాస్ మందును కలిపి పిచికారీ చేసుకోవాలి.
- వర్షాలు తగ్గిన మూడు, నాలుగు రోజులకు వరుసల మధ్య భాగాన్ని గుంటుకలతో దున్నాలి.
- అధిక వర్షాలకు వేరుకుళ్లు తెగులు ఆశిస్తే లీటరు నీటికి 3గ్రాముల కాఫర్ ఆక్సీక్లోరైడ్ లేదా ఒక గ్రామ్ కార్బండిజమ్ కలిపి మొక్క మొదళ్లలో తడపాలి.

**పెసర, మినుము:**

- పెసర, మినుము పంటల్లో పేనుబంక, లద్దెపురుగు ఆశించే అవకాశం ఉంది. లీటరు నీటికి ఎసిఫేట్ 1.5 గ్రాములు లేదా మోనోక్రోటోఫాస్ 1.6 మి.లీ కలిపి పిచికారీ చేయాలి.
- 20 నుంచి 25 రోజుల దశలో ఉన్న పంటలో కలుపు ఎక్కువగా ఉంటే అంతరసేద్యం సాధ్యంకానప్పుడు పెసర, మినుము పంటలలో ఎకరాకు 200 మి.లీ. ఇమిజిథాపిర్‌ను 200 మి.లీ. నీటిలో కలిపి పిచికారీ చేయాలి. ఈ మందు వాడినప్పుడు పంట పెరుగుదల తాత్కాలికంగా వారం రోజులు ఆగుతుంది. తర్వాత తేరుకుని మామూలుగా ఉంటుంది.
- వర్షాలకు ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు లీటరు నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారీ చేయాలి.

**మిరప:**

- మిరప నారుమళ్లలో వర్షపు నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- నారుకుళ్లు తెగులు నారుమళ్లను ఆశిస్తే లీటర్ నీటికి 3 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లేదా 2 గ్రాముల రిడోమిల్ కలిపి వారంలో రెండు, మూడుసార్లు నారుమళ్లను తడపాలి.
- నాటిన మిరప చేలలో నీరు నిల్వ లేకుండా చూడాలి.

**మొక్కజొన్న:**

- ముందుగా ఎకరానికి 50 కిలోల యూరియా, 20 కిలోల పొటాష్‌ను పైపాటుగా వేయాలి.
- కాండం తొలిచే పురుగు, ఆకు ఎండు తెగులు తీవ్రత ఎక్కువగా ఉండటానికి అవకాశం ఉంది. దీని నివారణకు గాను ఎకరానికి 400 మి.లీ ప్రొఫినోఫాస్, 200 మి.లీల ప్రొఫికొనజోల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి చేను బాగా తడిసే విధంగా పిచికారీ చేయాలి.
- వర్షాలు తగ్గిన తర్వాత వరుసలలో గుంటుకతో దున్నాలి.

**కంది:**

- పొలంలో నిల్వ ఉన్న నీటిని త్వరగా బయటకు పంపాలి.
- ఎకరాకు 15 కిలోల యూరియా, 15 కిలోల మ్యూరట్ ఆఫ్ పొటాష్‌లను పైపాటుగా వేయాలి.
- ఇనుపధాతు లోపం వచ్చే అవకాశం ఉన్నందున లీటరు నీటికి అన్నభేది 5–10 గ్రాములు,+ 1 గ్రాము నిమ్మ ఉప్పు కలిపి వారం రోజుల వ్యవధిలో రెండు, లేదా మూడు సార్లు పిచికారీ చేయాలి.
- అధిక తేమ వల్ల ఎండుతెగులు వచ్చే ప్రమాదం ఉంది. దీంతో మొక్కలు వాడుబడుతున్నట్లు కనిపిస్తే లీటరు నీటికి ఒక గ్రాము చొప్పున కార్బండిజమ్ కలిపి మొక్కల మొదళ్ల దగ్గర తడపాలి.